క్లుప్తంగా

శిల్పారామం పరిశీలన



శిల్పారామాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సీఈఓ స్వామినాయుడు

కడప కల్చరల్ : కడప శిల్పారామాన్ని రాష్ట్ర శిల్పారామాల సీఈఓ స్వామినాయుడు శుక్రవారం పరిశీలించారు. బోటింగ్ ఐల్యాండ్ చుట్టూ పూలమొక్కలను పెంచాలని, సిమెంటు బెంచీలను ఏర్పాటు చేయాలన్నారు. బోటింగ్ స్థితిగతుల గురించి శిల్పారామం స్థానిక ఏఓ శివప్రసాద్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఫిషర్ మ్యాన్ బొమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు బొమ్మల పైభాగాన టెర్రకోట ఐరన్ షీట్ ఏర్పాటుకు, బొమ్మల మధ్యలో నీరు నింపి రంగుల చేపలను ఏర్పాటు చేసేందుకు నిధులు ఇస్తామన్నారు.

నిర్మలా ఫార్మసి కళాశాలకు అటానమస్ హోదా



కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని ఉక్కాయపల్లి నిర్మలా ఫార్మసీ కళాశాలకు 2025–26 విద్యా సంవత్సరం నుంచి 5 సంవత్సరాల పాటు యూజీసీ అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా లభించిందని కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ యు. మోహన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మలా కళాశాల 24 సంవత్సరాల నుంచి ఉన్నతమైన విలువలు, ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు.

తెలుగు సాహిత్య విమర్శకు ఒరవడి దిద్దిన 'రారా'



రారా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

కడప కల్చరల్ : తెలుగు సాహిత్య లోకంలో 'రారా'గా ప్రసిద్ధులైన రాచమల్లు రామచంద్రారెడ్డి 'సంవేదన' తెలుగు త్రైమాసిక పత్రిక సంపాదకులుగా, తెలుగు సాహిత్య విమర్శకు నూతన ఒరవడిని సృష్టించారని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. కడపలో శుక్రవారం ఉదయం కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రారా 103వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కడప రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి ,అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి , ఆంధ్ర ప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడారు.

ఆవిష్కరణలే మొదటి ప్రాధాన్యం కావాలి



మాట్లాడుతున్న శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు రవిప్రసాదరావు

కడప ఎడ్యుకేషన్: భారతదేశ సాంకేతిక పురోగతి మూలాలు ప్రాచీన భారత శాస్త్రీయ దృక్పథానికి ముడిపడి ఉన్నాయని ఆ దిశగా అధ్యయనం జరగాలని అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు బి. రవిప్రసాదరావు పేర్కొన్నారు. నేషనల్ సైన్స్ డే –2025 ఉత్సవాలు యోగివేమన విశ్వవిద్యాలయం హ్యుమానిటీస్ భవనంలోని సురభి సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. కీలకోపన్యాసకులుగా హాజరైన బి. రవిప్రసాదరావు మాట్లాడుతూ పరిశోధకులకు కాలపరిమితి లేదన్నారు. సమాజ హితాన్ని కాంక్షించే పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులు ప్రాచీన భారతదేశ శాస్త్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకొని ప్రతి విషయంలోను హేతుబద్ధమైన ఆలోచనలతో ప్రాచీన భారతంలో ఉన్న మూలాల ప్రగతి సరైన విధానంలో అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ ఏడాది సైన్స్ దినోత్సవం థీమ్ ×విక్షిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో గ్లోబల్ లీడర్‌షిప్ కోసం భారతీయ యువతకు సాధికారత్ల అనే అంశంపై జరుగుతుందన్నారు. కులసచివులు ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ మనం నిత్యం అనుసరిస్తున్న ప్రతి వస్తువు సైన్సు అన్నారు. దైనందిక జీవితంలో మనకు తెలియకుండానే సైన్సును వినియోగిస్తున్నామన్నారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సు ఆచార్య ఎ.జి.దాము మాట్లాడుతూ శాస్త్రబద్ధమైన పరిశీలనలే పరిశోధనా ఆవిష్కరణలన్నారు. వృక్షశాస్త్ర ఆచార్యుల ఎ. మధుసూదనరెడ్డి అతిథిని సభకు పరిచయం చేయగా అప్లైడ్ మ్యాథమేటిక్స్ సహ ఆచార్యులు డా. ఎస్ సునితా వందన సమర్పణ చేశారు. వృక్షశాస్త్ర అధ్యాపకులు ఎస్. రాజగోపాల్ రెడ్డి, జర్నలిజం అధ్యాపకులు డా. టి.సురేశ్ బాబు ఆధ్వర్యంలో వక్తృత్వ , వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్ట్స్, సైన్సు, కామర్స్ విభాగాలలో స్కాలర్స్ లో ఉత్తమ పరిశోధనలు సాగిస్తున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

శాస్త్రీయ విజ్ఞానంతో ముందుకు నడవాలి



సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బ్రహ్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు శాస్త్రీయ విజ్ఞానంతో ముందుకు నడవాలని జన విజ్ఞాన వేదిక స్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి, వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శనివారం సైన్సు డిపార్టుమెంట్‌తోపాటు ఎన్ఎస్ఎస్, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్సు డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బ్రహ్మారెడ్డి, వెంకట్రామిరెడ్డిలు ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌తో కలిసి సర్ సివిరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలను వదిలి శాస్త్రీయ విజ్ఞానంతో మెలగాలన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సైన్సుతోపాటు మనం ప్రయాణించాలని సూచించారు. అనంతరం జేవీవీ జిల్లా సెక్రటరీ బాలబయన్న మ్యాజిక్ షో ద్వారా మూఢ నమ్మకం సైన్సు మధ్య తేడాను ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైన్సు పరిజ్ఞానం అలవరచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే సైన్సు పరిజ్ఞానం అలవరచుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండి ఇలియాస్‌బాష పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని వక్కల్‌పేట నగరపాలక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సైన్సు డేని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇలియాస్ బాష హాజరై సైన్సు ఫేర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు పరిజ్ఞానం విద్యార్థి దశ నుంచే అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ నజీబుల్లా, ఎస్టీయూ నగర అధ్యక్షుడు సాధిక్‌అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. కడప అక్కాయపల్లెలోని వికాస్ ఇంగ్లీష్ మీడీయం స్కూల్లో శుక్రవారం నేసనల్ సైన్సు డేని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఈఓ షంషుద్దీన్‌తోపాటు కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాష, యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, కడప ఎంఈఓ గంగిరెడ్డిలు స్కూల్ కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణతో కలిసి సైన్సు ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు కృషి

కడప కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం, జాతీయ సైన్స్ దినోత్సవాలను అక్కాయపల్లె విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జేవీవీ నాయకులు వెంకటేశ్వర్లు సంస్థ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి రాహుల్ మాట్లాడుతూ 37 సంవత్సరాలుగా జనవిజ్ఞాన వేదిక ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సరస్వతి, సువర్ణ, శ్రీనివాస రాజు, శ్రీనాథ్, సుష్మ, గౌతమి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సైంటిస్టులుగా ఎదగాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజరాజేశ్వర రెడ్డి

కడప ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు బాగా చదువుకుని భావి భారత సైంటిస్టులుగా ఎదగాలని చిన్నచౌకు పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచి సైన్సు పట్ల ఆసక్తి కలిగి ఉన్నప్పుడు ఆవిష్కరణలు రూపొందుతాయన్నారు.

బైక్ మెకానిక్ ముసుగులో చోరీలు

– 18 మోటార్ సైకిళ్లు స్వాధీనం

కడప అర్బన్ : మోటార్ సైకిల్ మెకానిక్ ముసుగులో వచ్చి బైక్‌లు దోచుకెళ్తున్న దొంగకు పోలీసులు చెక్ పెట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రూ.8 లక్షల విలువైన 18 మోటారు సైకిళ్లను రికవరీ చేశారు. కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణ వివరాలు వెల్లడించారు. ఇటీవల మోటారు సైకిళ్ల చోరీలు పెరగడంతో ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు.. సీఐ, ఎస్ఐలు నిఘా పెట్టారు. అనుమానితులను విచారించి.. కడప రవీంద్ర నగర్‌కు చెందిన వేల్పుల నరేంద్ర అలియాస్ మహేంద్రను నిందితుడిగా గుర్తించారు. శుక్రవారం మహేంద్రను అరెస్టు చేసి అతడి నుంచి 18 మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అవకాశమున్న ప్రతి చోటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు.

నేటి నుంచి మోటారు వాహన నూతన చట్టం అమలు

కడప అర్బన్: కడప నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మార్చి 1 నుంచి మోటార్ వాహనాల నూతన చట్టం అమల్లోకి వస్తుందనిని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెల్మెట్ ఉల్లంఘనను ప్రస్తుతం రూ.135 జరిమానా విధిస్తున్నామని, నూతన చట్టం ప్రకారం రూ. 1000 జరిమానాగా విధిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 10 వేలు జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

గండికోట నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : గండికోట ప్రాజెక్టు నిర్మాణంతో ఇల్లు, పొలాలు కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే పరిహారం ఇవ్వాలని, పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కనకాంబరాలు అమ్మి కడుపు నింపుకుంటున్న కొండాపురం నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జలాశయం పూర్తయి పది సంవత్సరాలైనా సమస్యలు ఉన్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో పది లక్షల రూపాయలు చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పినా 22 గ్రామాలకుగాను ఏడు గ్రామాలకే చెల్లించారని తెలిపారు. పెంజి అనంతపురం గ్రామంలో 26 మందికే ఇచ్చారన్నారు. 22 గ్రామాల్లో అర్హులై ఉండి గెజిట్‌లో పేరున్నప్పటికీ ఇంకా పునరావాసం రాక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. రెండవ విడతలో ఏర్పాటైన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి లేక పది కిలోమీటర్ల దూరం దినసరి కూలీ కోసం వెళుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.బాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'జానమద్ది' ఆశయాల బాటలోనే 'బ్రౌన్' అభివృద్ధి



డాక్టర్ జానమద్ది చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహిత్యాభిమానులు

కడప కల్చరల్ : డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలకు అనుగుణంగా సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి అన్నారు. శుక్రవారం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 11వ వర్ధంతిని, స్మారకోపన్యాసాన్ని నిర్వహించారు. తొలుత అతిథులు, నిర్వాహకులు కలిసి జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య రఘునాథ రెడ్డి , బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడారు. బ్రౌన్ కీర్తిని అజరామరం చేసేందుకు జానమద్ది జీవితమంతా ధారపోశారన్నారు. అందులో భాగంగానే బ్రౌన్ స్మారక గ్రంథాలయాన్ని నెలకొల్పారని వివరించారు. మొల్ల సాహిత్య పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కూడా మాట్లాడారు. ప్రధాన వక్తగా విచ్చేసిన రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఆచార్య పి.ఆర్.హరినాథ్ (మైసూరు) 'తెలుగు పద్య వైభవం – శబ్ద సౌందర్యం' అనే అంశంపై ప్రసంగిస్తూ సాహిత్య పరంగా హనుమచ్ఛాస్త్రి విలక్షణమైన వ్యక్తి అని, సంస్థ చేయదగిన పనిని ఒక్కడిగా చేయడం విశేషమన్నారు. కె.రాజారత్నం ఐజాక్, ఆచార్య పాయసం సుబ్రహ్మణ్య మహర్షి, కందిమల్ల రాజా రెడ్డి, కల్లూరు బాలయల్లారెడ్డి, ముడియం కిశోర్, కొత్తపల్లి రామాంజనేయులు తదితరులు జానమద్దితో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. నిర్వాహకులతో కలిసి బ్రౌన్‌కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి అతిథులను సత్కరించారు.

వక్ఫ్ బిల్లుతో ముస్లింలలో అభద్రతాభావం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీలు

కడప కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లుతో ముస్లిం సమాజంలో అభద్రతాభావం ఏర్పడిందని ఏపీ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ చైర్మెన్ మహ్మద్ ఇబ్రహీం, సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ అన్నారు. స్థానిక బళ్లారి రోడ్డులోని అల్తాఫ్ ఏజెన్సీస్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లిం పూర్వీకులు తమ కష్టార్జితంలో కొంత మసీదులు, మదరసాల నిర్వహణకు ఆస్తులు ఇచ్చారన్నారు. వాటిని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నూతన సవరణలతో బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. వక్ఫ్ ద్వారా మసీదులు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, అనాథాశ్రమాలు, పేదలకు సహాయ నిధులు ఇవ్వగలిగారన్నారు. అనంతరం వక్ఫ్ బోర్డు గూర్చి తెలియజేసే చైతన్య గీతాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మైనార్టీ వెల్ఫేర్ ఫెడరేషన్ నాయకులు పవర్ అల్తాఫ్, అష్రఫ్ అలీఖాన్, రఫీఖ్ ఖాన్, గౌస్‌పీర్, మగ్బూల్‌బాషా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ట్రాన్స్‌కో అభివృద్ధికి క్రిష్ణమనాయుడు విశేష కృషి



సీఈ క్రిష్ణమనాయుడును సత్కరిస్తున్న ట్రాన్స్ కో అధికారులు, ఉద్యోగులు

కడప కార్పొరేషన్: ఏపీ ట్రాన్స్‌కో లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి చీఫ్ ఇంజినీర్‌గా విరమణ చేస్తున్న క్రిష్ణమ నాయుడు అందించిన సేవలు విలువైనవని వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చెందిన క్రిష్ణమనాయుడును ట్రాన్స్ కో అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం నగర శివార్లలోని పద్మప్రియ కళ్యాణమండపంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ క్రిష్ణమనాయుడు ఎంతో నిబద్ధత కలిగిన వారని, కష్టపడి పనిచేసే తత్వంతో, నాయకత్వ ప్రతిభతో సంస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం పలువురు ఎస్ఈలు, ఈఈలు మాట్లాడుతూ క్రిష్ణమనాయుడుతో వారి అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఈ క్రిష్ణకుమార్, ఎస్ఈలు బాషా, కరుణాకర్, మధుసూదన్, రాజేంద్రప్రసాద్, విశ్వేశ్వర్‌రెడ్డి, వరప్రసాద్, కె.శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాసరావు, రిటైర్డ్ సీఈలు శ్రీరాములు, నరసింహులు, నరసింహ కుమార్, బీసీ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య, ఆర్గనైజర్లు నారాయణస్వామి, చిరంజీవి, రమణ, సుబ్బయ్య, అచ్యుత్‌రెడ్డి, అధిక సంఖ్యలో ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సైబర్ బాధితులకు సత్వర న్యాయం



భక్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : సైబర్ నేరాల్లో బాధితులకు సత్వర న్యాయం అందిస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఎ.మధుమల్లేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పొలతలలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరా లు ఎక్కువగా జరుగుతున్నాయని, మహిళలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. చాలామంది ఎవరికి చెప్పుకోవాలో తెలియక మదనపడుతూ, మానసికంగా నలిగిపోతూ, ఆత్మహత్యాయత్నం చేస్తున్నారన్నారు. ఈకెవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామంటూ అడిగినా ఓటీపీ చెప్పరాదన్నారు. అపరిచితుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. నకిలీ వెబ్ సైట్, బ్యాక్ డోర్ ఉద్యోగ అఫర్లు, ఇ–మెయిల్స్‌కు స్పందించరాదన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

ఆర్టీసీని ఆదరించిన భక్తులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలకు వెళ్లేందుకు భక్తులు ఆర్టీసీ సంస్థను ఆదరించి ఆయా బస్సుల్లో ప్రయాణించడంపై ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 27వ తేది వరకు శైవ క్షేత్రాలకు 253 ప్రత్యేక బస్సులను నడిపామన్నారు. వీటి ద్వారా రూ. 73,97,613 ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. కడప డిపోకు సంబంధించి 105 బస్సులు ద్వారా రూ. 38,80,594 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే బద్వేలు డిపోకు సంబంధించి 44 బస్సులు నడపడం ద్వారా రూ. 10,67,819, పులివెందుల డిపో పరిధిలో 29 బస్సుల ద్వారా రూ. 7,81,791, ప్రొద్దుటూరు డిపో పరిధిలో 32 బస్సుల ద్వారా రూ. 6,85,139, మైదుకూరు డిపోలో 33 బస్సుల ద్వారా రూ. 8,18,703, జమ్మలమడుగు డిపోలో 10 బస్సులు తిరగడం ద్వారా రూ. 1,63,567 ఆదాయం వచ్చిందన్నారు. సంస్థకు పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చేందుకు తమవంతుగా కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలని డీఆర్‌డీఏ –సీడ్యాప్ జిల్లా జాబ్స్ మేనేజర్ హరప్రసాదరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగర శివార్లలోని టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఆక్సెస్ బ్యాంకు లిమిటెడ్‌లో జూనియర్ ఆఫీసర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. హాజరైన అభ్యర్థులకు మొదటి రౌండ్ ముఖాముఖి నిర్వహించి 90 మందిని ఎంపిక చేశారు. అనంతరం వారికి ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హర ప్రసాదరాజు మాట్లాడుతూ యువత వచ్చిన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని .. ఆ తర్వాత ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ హెచ్ఆర్ మేనేజర్ పవన్, సి–డ్యాప్ డైరెక్ట్ ప్లేస్మెంట్ ట్రైనర్ పృథ్వీరాజ్, రంగస్వామి పాల్గొన్నారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే గుర్తింపు



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే.. పోలీస్ శాఖ గుర్తుంచుకుంటుందని ఎస్పీ ఇ.జి.అశోక్ కుమార్ అన్నారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పదవీ విరమణ పొందిన ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ ఏఎస్ఐ వి.గోపాల్, కడప టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ ఓ.చంద్రగుప్తుడులను ఎస్పీ శుక్రవారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన తర్వాత విశ్రాంత జీవితాన్ని కుటుంబంతో ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యంపై దృష్టిసారించాలని సూచించారు. ఎలాంటి సమస్యనైనా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐ టైటస్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో జైలు శిక్ష

వేంపల్లె : అత్యాచారం కేసులో ఓ ముద్దాయికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. ఎస్ఐ వివరా లమేరకు.. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొమ్మద్ది గంగయ్య రోజు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూలి పనులకు వెళ్లిన సమయంలో మతిస్థిమితం లేని అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన శివ నారాయణ అత్యాచారం చేశాడు. బాధితురాలి భర్త గంగయ్య ఫిర్యాదు మేరకు 2023 జూన్‌లో కేసు నమోదు చేశారు. శుక్రవారం కడప మహిళ కోర్టులో సాక్షులు చెప్పిన మాటలు నిరూపణ కావడంతో ముద్దాయి శివ నారాయణకు జడ్జి రమేష్‌కుమార్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.